క్లుప్తంగా

రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు


పూజలందుకుంటున్న అమ్మవారు

బొండపల్లి: జ్యేష్ఠ పంచమి సందర్భంగా దేవుపల్లి గ్రామంలోని రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో అర్చకులు దూసి శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో అమ్మ వారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు.అమ్మవారికి ఉదయాన్నే పంచామృతాభిషేకాలు చేసి, విశేషంగా అలంకరించారు.జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో అమ్మవారికి అర్చకులు పూజలు చేయించారు.

సచివాలయంలో తనిఖీలు


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: మండలంలోని కొత్తపాలెం గ్రామ సచివాలయంలో ఎంపీడీఓ ఎస్.హరిహర రావు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. సిబ్బంది హాజరు,తదితర రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన సిబ్బందితో మాట్లాడుతూ అన్ని శాఖలకు సంబంధించిన రికార్డులను పక్కాగా నిర్వహించాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సక్రమంగా సేవలందించాలని సిబ్బందికి చెప్పారు.

ఉపాధి పనుల పరిశీలన


వేతనదారుల మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరిహరరావు

బొండపల్లి: మండలంలోని జె.గుమడాం గ్రామంలో చేపడుతున్న ఉపాధి పనులను ఎంపీడీఓ ఎస్.హరిహరరావు మంగళవారం పరిశీలించారు. ఈసందర్భంగా వేతనదారులతో ఆయన మాట్లాడు తూ ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పొలాలకు వెళ్లే మార్గాల అభివృద్ధితో పాటు చెరువుగట్లను పటిష్టం చేయడం, ఉద్యానవన పంటలకు సంబంధించిన పనులు చేపట్టాలని సూచించారు. జాబ్ కార్డులు లేని వారందరికీ జాబ్ కార్డులు మంజూరు చేసేలా పంచాయతీ కార్యదర్శి, ఉపాధి సిబ్బంది చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఏపీ ఈఏపీసెట్‌లో ప్రతిభ


గొంప మణికంఠ


జి.తిలోత్తమ

శృంగవరపుకోట: స్థానిక పుణ్యగిరి ప్రైవేటు జూనియర్ కళాశాల విద్యార్థులు మంగళవారం విడుదలైన ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో మంచి ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన గొంప మణికంఠ 3708 ర్యాంక్, జి.తిలోత్తమ 10,041 ర్యాంకు సాధించారని ప్రిన్సిపాల్ బి.మధుసూధనరావు చెప్పారు. మణికం ఇంటర్ బైపీసీ గ్రూప్‌లో 987 మార్కులు, జి.తిలోత్తమ ఎంపీసీ గ్రూప్‌లో 984 మార్కులు సాధించారని, తాజాగా ఈఏపీసెట్ ఫలితాల్లో మంచి ర్యాంకులు పొందారని ప్రిన్సిపాల్ తెలిపారు. పుణ్యగిరి విద్యాసంస్థల కరస్పాండెంట్ లగుడు సత్యనారాయణ, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

ఆయుర్వేదం ఆరోగ్యానికి శ్రేయస్కరం


రేగిడి: ఆయుర్వేద మందులు అందుకున్న వారితో వైద్యాధికారి సునీల్‌కుమార్

రేగిడి: ఆయుర్వేద వైద్యం ఆరోగ్యానికి శ్రేయస్కరమని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి సునీల్‌కుమార్ అన్నారు. మండలంలోని ఖండ్యాం గ్రామంలో ఆయుర్వేద వైద్యశిబిరం మంగళవారం నిర్వహించారు. వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ శిబిరానికి హాజరైన వారికి ఆయన వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం ఆయుర్వేద వైద్యంలోని అద్భుతాలను వివరించారు. దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసే శక్తి ఆయుర్వేదానికి ఉందని, ప్రతిఒక్కరూ ఆయుర్వేద మందులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ప్రసాద్, చక్రధర్, సింహాచలం, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వద్దు..
ప్రజారోగ్యమే ముద్దు

- కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు
- నగరం పారిశుద్ధ్య విధానంలో మెరుగైన మార్పులు తీసుకురావాలి


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు

విజయనగరం: 'ప్లాస్టిక్‌ను విడనాడుదాం.. ప్రజారోగ్యాన్ని కాపాడుకుందాం' అన్న నినాదాంతో నగరంలో పారిశుద్ధ్య విధానంలో మెరుగైన మార్పు తీసుకురావాలని, లేదంటే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు స్పష్టం చేశారు. కార్పొరేషన్ కార్యాలయంలో పారిశుద్ధ్య పర్యవేక్షకులు, సచివాలయ శానిటరీ కార్యదర్శులతో మంగళవారం సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అంశాల వారీగా పారిశుద్ధ్య విధానంలో చేపడుతున్న చర్యలపై సమీక్షించారు. రానున్న వర్షాకాలంలో ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. దీనికి అవసరమైన పనిముట్లు, యంత్రాలు తదితర అంశాలపై సమగ్ర నివేదికలు రూపొందించి అందించాలన్నారు. సచివాలయాల వారీగా పారిశుద్ధ్య లోపాలను అడిగి తెలుసుకున్నారు. ప్రధాన కాలువల్లో పూడికతీతలు నిలిచి ఉన్న పరిస్థితులపై ప్రస్తావించారు. వర్షాలు కురిసే సమయానికి ముందుగానే కాలువల్లో పూడికతీత పనులు పూర్తికావాలని ఆదేశించారు. నీరునిల్వ ఉన్న ప్రదేశాలను గుర్తించాలని చెప్పారు. దోమల నియంత్రణకు కార్యాచరణ అమలు చేయాలన్నారు. లార్వాదశలోనే దోమలను నియంత్రించాలని, అందుకు అవసరమైన యాంటీ లార్వా ఆపరేషన్‌ను పకడ్బందీగా అమలు చేయాలని చెప్పారు. చెరువులు, కుంటలలో ఆయిల్ బాల్స్ పిచికారినీ ముమ్మరం చేయాలన్నారు. ప్రతిఇంటి వద్ద ఉన్న సెప్టిక్ గొట్టాలకు నెట్లు అమర్చేలా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. మొక్కలను విరివిగా నాటేందుకు అవసరమైన స్థలాల వివరాలను తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న దష్ట్యా విద్యార్థులకు అందుబాటులో ఉన్న మౌలిక సదుపాయాల పరిస్థితులపై తనిఖీలు చేయాలన్నారు. నగరంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించేవరకు అవిశ్రాంతంగా పోరాడాలని పిలుపునిచ్చారు. దీనికోసం ఆకస్మిక తనిఖీలకు ఆదేశించారు. నగరంలో ఉన్న భోజనశాలల చుట్టూ పరిశుభ్ర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆహార పదార్థాలు తాజాగా, పరిశుభ్రంగా ఉన్నాయా లేదా అనేది గమనించాలన్నారు. వీధి కుక్కలకు శతశాతం స్టెరిలైజేషన్ అయ్యేవిధంగా చూడాలన్నారు. సమావేశం అనంతరం ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దేందుకు తాము చేస్తున్న కృషికి ప్రజలందరూ సహకరించాలని కోరారు. క్షేత్రస్థాయి నుండి పారిశుద్ధ్య విధానాల్లో సమూల మార్పులు తీసుకొచ్చి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. సమీక్ష సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, పారిశుద్ధ్య పర్యవేక్షకులు, కార్యదర్శులు పాల్గొన్నారు.


హాజరైన పారిశుద్ధ్య పర్యవేక్షకులు

వేడుకగా పైడిమాంబ కళానికేతన్ వార్షికోత్సవం


అన్నమాచార్య గీతాలాపన చేస్తున్న శ్రీవారి స్వచ్ఛంద సేవా సంఘం భీష్మారావు బృందం


హాజరైన సంస్థ ప్రతినిధులు, అభిమానులు

విజయనగరం టౌన్: పైడిమాంబ కళానికేతన్ ఆధ్యాత్మిక సేవా సంఘం 26వ వార్షికోత్సవాన్ని సంస్థ ప్రతినిధులు మంగళవారం రాత్రి వేడుకగా నిర్వహించారు. అమ్మవారి చదురుగుడి నుంచి గురజాడ కళాభారతి వరకూ కృష్ణవేణి సాయిరాం బృందంతో ఊరేగింపు చేశారు. అనంతరం కళాభారతి ఆవరణలో శ్రీవారి స్వచ్ఛంద సేవా సంఘం వ్యవస్థాపకుడు ఎమ్.భీష్మారావు సారథ్యంలో నిర్వహించిన అన్నమాచార్య కీర్తనాలాపన ఆద్యంతం ఆహుతులను భక్తి పారవశ్యంలో ముంచెత్తింది. నర్తనశాల చిన్నారుల నృత్యప్రదర్శన రక్తికట్టించింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభా కార్యక్రమాన్ని రాజాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పెన్నేటి స్వప్న హైందవి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన పైడితల్లి దేవస్థానం ఈఓ డీవీవీ.ప్రసాదరావు మాట్లాడుతూ అమ్మవారి సేవలో తరిస్తున్న సంస్థ 26వ వార్షికోత్సవం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు సూర్యపాత్రో, ప్రతినిధులు ధవళ సర్వేశ్వరరావు, బాలు, భానురాజా, తదితరులు పాల్గొన్నారు.

సాధనా సభ్యుల ఔదార్యం

- సికిల్‌సెల్ ఎనీమియా రోగికి రక్తదానం


రక్తదానం చేస్తున్న సాధనా సభ్యుడు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధి జరజాపుపేటకు చెందిన సాధనా యువజన సంఘం సభ్యులు ఏబీ పాజిటివ్ రక్తాన్ని దానం చేశారు. నెల్లిమర్ల పట్టణంలోని మిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్న ఆరేళ్ల చిన్నారి రోహిణికి అత్యవసరంగా ఏబీ పాజిటివ్ రక్తం అవసరమైంది. విషయం తెలుసుకున్న సాధనా ప్రతినిధులు, రక్తదాతలు గర్భపు శ్రీను, మద్దిల రాంబాబు స్పందించారు. ఇరువురూ రక్తదానానికి ముందుకొచ్చారు. శ్రీను 19వ సారి, రాంబాబు 30వ సారి రక్తదానం చేశారు. రక్తదాతలను మిమ్స్ హెచ్ఆర్ మేనేజర్ ఆరిపాక శ్రీనివాసరావు, సంఘ అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాద్, బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు అభినందించారు.

పిల్లల అభివృద్ధికి కుటుంబం పాత్ర కీలకం

- ఎంపీడీఓ రాధిక


మాట్లాడుతున్న ఎంపీడీఓ రాధిక

పూసపాటిరేగ: పిల్లల అభివృద్ధికి కుటుంబం, సమాజం పాత్ర కీలకమని ఎంపీడీఓ ఎం.రాధిక అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బందికి వివిధ అంశాలపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావిభారత పౌరులని, పిల్లలకు నైతిక విలువలు నేర్పాలన్నారు. వారి ఎదుగుదలకు కుటుంబంతో పాటు సమాజం కృషిచేయాలన్నారు. వైద్యాధికారి ప్రమీలాదేవి మాట్లాడుతూ ఆరేళ్లలోపు పిల్లలకు అంగన్‌వాడీలు, ఆరోగ్యశాఖల అందించాల్సిన సేవలను వివరించారు. పౌష్టికాహారం పంపిణీ, ఆరోగ్యం, పరిశుభ్రత, నోటి, దంత ఆరోగ్యం, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తల పాత్ర, బాధ్యతలను వివరించారు. కార్యక్రమంలో పూసపాటిరేగ వైద్యాధికారి రాజేష్‌వర్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాజేశ్వరి, సత్యవతి, హెల్త్ ఎడ్యుకేటర్ మహేశ్వరి, సిబ్బంది ఆర్.వి. రమణ, పూర్ణిమ, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండండి


ఆశ వర్కర్లు, వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న డాక్టర్ గోపాలకృష్ణ

కొత్తవలస: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని,క్షేత్రస్థాయిలో వైద్యారోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ సూచించారు. వియ్యంపేట పీహెచ్‌సీలో వైద్యసిబ్బంది, ఆశ కార్యకర్తలతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసంద ర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ అంటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, ఆ దిశగా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించా రు. క్షయరోగులు క్రమం తప్పకుండా మందులు వేసుకునేలా చూడాలని చెప్పారు. వయోజనులకు బీసీజీ వ్యాక్సినేషన్ శతశాతం పూర్తి చేయాలని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణులను గుర్తించి, వారు తీసుకోవాల్సిన మందులు, జాగ్రత్తలను వివరించాలని సూచించారు. ఆస్పత్రి వైద్య సిబ్బంది నరసింహారావు, జగదాంబ, పద్మావతి, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

తగ్గిన రూ.10నోటు చలామణి

- పెరిగిన ఆన్‌లైన్ చెల్లింపులు
- వ్యాపారులకు చిల్లర సమస్య
- నోట్ల వినియోగం తగ్గడంతో వినియోగదారులతో పాటు వ్యాపారులకు ఇబ్బందులు


రూ.10 నోటు

విజయనగరం: జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లో రూ.10 నోటు చలామణి తగ్గింది. వ్యాపారులు, కొనుగోలుదారులు ఇబ్బంది పడుతున్నారు. దశాబ్దం కిందట సాధారణ కొనుగోలుకు 5, 10, 20, 25, 50 పైసల నాణేలు చలామణిలో ఉండేవి. కాలక్రమేణా అవి కనుమరుగై రూపాయి ప్రామాణికంగా చలామణిలోకి వచ్చింది. క్రమంగా ధరల పెరుగుదల కారణంగా రూ.1, రూ.2, రూ.5ల నాణేలు ఉన్నా కొంతకాలంగా రూ.5లు, రూ.10లు ప్రామాణికంగా నడుస్తోంది. వ్యాపారులు ఏదైనా వస్తువు విలువ చెప్పేటప్పుడు రూ.5కు రెండు, రూ.10కు మూడు అని చెబుతున్నారు. దీంతో కిరాణ, ఫ్యాన్సీ, కూరగాయలు, ఇతర అన్ని సాధారణ వ్యాపారాల్లో రూ.10 ప్రాధాన్యం పెరిగింది. ప్రస్తుతం రూ.10ల నోటు మార్కెట్‌లో అందుబాటులో లేక వ్యాపారులుతో సైతం వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు.

పెరిగిన ఆన్‌లైన్ చెల్లింపులు

కరోనా తరువాత డిజిటల్ చెల్లింపులు పెరిగాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తున్నాయి. దీంతో అన్ని వర్గాల ప్రజలు ఆన్‌లైన్ చెల్లింపులకు అలవాటు పడిపోయారు. ఏ దుకాణానికి వెళ్లినా, ఏ వస్తువు కొనాలన్నా డిజిటల్ చెల్లింపులు పని చేస్తున్నాయా? అనే పరిస్థితి నెలకొంది. చిన్నపాటి చెల్లింపులకు ఫోన్‌పే, గూగుల్‌పే, ఎస్‌బీఐ యూనో వంటివి ప్రత్యేకంగా వ్యాలెట్ రూపంలో సులభతర చెల్లింపులు అనుమతిస్తున్నాయి. వీధి వ్యాపారులు, చిన్న దుకాణాల్లో సైతం డిజిటల్ చెల్లింపులు పెరిగిపోయాయి. దీంతో రూ.5, రూ.10ల లావాదేవీలకు కూడా వినియోగదారులు నోట్లు ఇవ్వడంలేదు. క్రమంగా రూ.10ల నోటు బదలాయింపు జరగక పోవడం వల్ల వ్యాపారులు, వినియోగదారుల వద్ద అందుబాటులో లేకుండా పోయింది. మార్కెట్‌లో ప్రస్తుతం చిరిగిన రూ.10 నోట్లు దర్శనమిస్తుండటం గమనార్హం.

ఎక్కడ ఆగిందో?

రూ.10లు మార్కెట్‌లో చలామణి తగ్గడంలో అసలు సమస్య ఎక్కడ ఉత్పన్నమైందో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. వ్యాపారులు సైతం ఈ పరిస్థితిపై ఓ అంచనాకు రాలేకపోతున్నారు. ఎవరైనా వినియోగదారుడు చిరు వ్యాపారుల వద్ద ఏదైనా వస్తువు కొనుగోలు చేసినప్పుడు రూ.100ల నోటు ఇస్తే వ్యాపారులు తిరిగి ఇవ్వాల్సిన చిల్లరకు నానా అవస్థలు పడుతున్నారు. గతంలో రూ.1, రూ.2ల చెల్లింపులకు బదులు చాక్లెటు, బిస్కెటు వంటివి ఇచ్చేవారు కానీ రూ.10లకు ఏమి ఇవ్వాలని వ్యాపారులు ఆలోచనలో పడ్డారు. ఇస్తే వినియోగదారుడు ఎలా స్పందిస్తారనే ఆందోళన వారిలో ఉంది. భారీ మొత్తాలు చెల్లింపుల విషయంలో పరిస్థితి భిన్నంగా ఉంది. పెద్ద మొత్తంలో లావాదేవీలకు డిజిటల్ చెల్లింపులు జరిగితే వినియోగదారులు, వ్యాపారులు పన్నుల పరిధిలోకి వస్తామని ఆందోళన చెందుతుండటమే ఈ పరిస్థితికి కారణం. చిన్న మొత్తాల చెల్లింపుల కారణంగా కొన్నిసార్లు యూపీఐ సర్వర్లపై భారం పడి పని చేయని పరిస్థితి నెలకొంటోందని వ్యాపారులు చెబుతున్నారు.

రూ.10 నోట్ల రావడం లేదు..

మార్కెట్‌లో రూ.10 నోట్ల చలామణి తగ్గింది. వినియోగదారులంతా రూ.20, రూ.50, రూ.100 నోట్లు తీసుకువస్తున్నారు. దీంతో చిల్లర సమస్య ఎక్కువగా ఉంది. నగరంలో రూ.10 నాణేల ఎవ్వరు తీసుకోవడం లేదు. ఫలితంగా వ్యాపారాలపై ప్రభావం పడుతుంది. పెద్ద సమస్యగా మారింది. బ్యాంక్ అధికారులైన రూ.10 నోట్లను ఎక్కువగా రిలేజ్ చేస్తే చిల్లర సమస్య తీరుతుంది.
– ఎస్. ప్రశాంత్, చిరువ్యాపారి, విజయనగరం

దయచేసి మా పొట్ట కొట్టొద్దు...

- రైల్వే అధికారులు చిరు వ్యాపారుల కోసం ఆలోచన చేయాలి
- ముందు నిర్మించిన రిటైనింగ్ వాల్‌నే శాశ్వతం చేయాలి


ఆర్ఓబీ అప్రోచ్ రోడ్‌కు అనుసంధానంగా నిర్మించిన రిటైనింగ్ వాల్ వద్ద మాట్లాడుతున్న చిరు వ్యాపారులు

చీపురుపల్లి: రైల్వే ఓవర్ బ్రిడ్జి(ఆర్ఓబీ) నిర్మాణం ఎంతో మందికి అవసరమే అయినప్పటికీ దాని పేరుతో చిరు వ్యాపారాలు సాగిస్తూ జీవనం సాగిస్తున్న వారి దుకాణాలు తొలగించి చిరు వ్యాపారులు పొట్ట కొట్టొద్దని పట్టణంలోని గాంధీ బొమ్మ జంక్షన్ నుంచి ఆర్ఓబీ మధ్యలో వ్యాపారాలు సాగిస్తున్న వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఆర్ఓబీ సమీపంలో దుకాణాలు నిర్వహిస్తున్న దాదాపు 70 మంది చిరు వ్యాపారులు మంగళవారం విలేకరుల ముందు తమ ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నో దశాబ్దాలుగా చిన్న చిన్న దుకాణాలు పెట్టుకుని ఇక్కడే వ్యాపారాలు సాగిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నట్లు చెప్పారు. ఇక్కడ తమ దుకాణాలు లేకపోతే కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్ఓబీలో భాగంగా కొత్త బ్రిడ్జి నిర్మాణం జరుగుతోందని ఆ బ్రిడ్జి ఎంతో మందికి ఉపయోగమన్నారు. దానికి తాము వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ఆర్ఓబీ పనులు దాదాపు పూర్తి కావొచ్చాయని ఆ బ్రిడ్జిను పట్టణానికి అనుసంధానం చేస్తూ ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్‌కు సంబంధించి రిటైనింగ్ వాల్స్ నిర్మించినట్లు చెప్పారు. అప్పటికే తమ దుకాణాలు నష్టపోతున్నప్పటికీ కాస్త వెనక్కి తగ్గి సహకరించామన్నారు. అయితే తాజాగా రైల్వే అధికారులు వచ్చి ఇప్పుడున్న రిటైనింగ్ వాల్ తొలగించి మరింత వెనక్కి అంటే తమ దుకాణాలు తొలగించే విధంగా రిటైనింగ్ వాల్ కడతామని చెప్పి వెళ్లడంతో తమ పరిస్థితి ఏమిటో అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికే ప్రభుత్వ నిధులు వెచ్చించి నిర్మించిన రిటైనింగ్ వాల్ తొలగించడం, తమ దుకాణాలు తొలగించే విధంగా కొత్తగా రిటైనింగ్ వాల్ నిర్మిస్తామని చెప్పడం అనుమానాలకు తావిస్తోందన్నారు. దీనిపై 70 దుకాణాలకు చెందిన వ్యాపారులమంతా రైల్వే డీఆర్ఎంను కలిసేందుకు సిద్ధమైనట్లు స్పష్టం చేశారు. రోడ్డుకు ఇరువైపులా ఒకే విధంగా రిటైనింగ్ వాల్ నిర్మించకుండా తమ వైపు దుకాణాలు పోయే విధంగా చర్యలు చేపట్టడంతో తమ బతుకులు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే అధికారులు స్పందించి తమ కుటుంబాలు రోడ్డున పడకుండా చూడాలని కోరారు.

మానసిక సమస్యలకు కౌన్సెలింగ్‌తో పరిష్కారం


వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

చీపురుపల్లిరూరల్(గరివిడి): మానసిక రోగులకు చికిత్స అందించి, కౌన్సెలింగ్ ఇవ్వడం ద్వారా వ్యాధిని నయం చేయవచ్చని గరివిడి మండలంలోని బొండపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి అనిల్‌కుమార్ అన్నారు. మానసిక ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీలో ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, వైద్య సిబ్బందికి మానసిక వ్యాధులు, వాటి నివారణపై మంగళవారం అవగాహన కల్పించారు.జిల్లా క్లినికల్ సైకాలజిస్టు సీహెచ్.రాజు మాట్లాడుతూ నిద్రపట్టకపోవడం, పనిపై ఆసక్తి లేకపోవడం, ఆకలి మందగించడం, మతిమరుపు వంటివి మానసిక రోగాల లక్షణాలని చెప్పారు. అలాంటి వారిని గుర్తించి కౌన్సెలింగ్ ఇప్పించాలని సూచించారు. అంతకుముందు మానసిక సమస్యలతో బాధపడుతున్న పలువురికి కౌన్సెలింగ్ ఇచ్చి మందులు పంపిణీ చేశారు.సైక్రియాట్రిక్ నర్సు పి.మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత


బాధిత కుటుంబానికి చెక్కు అందజేస్తున్న మేనేజర్ జనార్దన్

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామానికి చెందిన గళ్ల కాసులమ్మ కుటుంబానికి ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమాయోజన (పీఎంజేజేబీవై)పథకం కింద రూ.2లక్షల బీమా చెక్కును వేపాడ ఏపీజీవీబీ మేనేజర్ జనార్దన్ మంగళవారం అందజేశారు. గళ్ల కాసులమ్మకు (48) వేపాడ గ్రామీణ వికాస్ బ్యాంకులో ఖాతా ఉంది. ఆమె పీఎంజేజేబీవై పాలసీ తీసుకున్నారు. ఇటీవలే ఆమె మరణించడంతో బీమా వర్తించింది. నామినీ, మృతురాలి భర్త ఈశ్వరరావుకు సంబంధిత చెక్కును బ్యాంకులో అందజేశారు ఈసందర్భంగా బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులంతా విధిగా జీపీఐ, పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవై పథకాల్లో చేరి కుటుంబానికి భరోసా కల్పించాలని సూచించారు. బ్యాంకు ఎఫ్ఎం శోభన్‌బాబు, క్యాషియర్లు చంద్రబాబునాయుడు, రామారావు, సీఎస్‌పీ సారిక ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శస్త్రచికిత్సకు 34 మంది ఎంపిక

బొబ్బిలి: స్థానిక పట్టణంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత నేత్రవైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. కంటి సమస్యలతో బాధపడుతున్న 96 మంది శిబిరానికి హాజరుకాగా, వారికి వైద్యపరీక్షలు చేసిన వైద్యులు 34 మందికి శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుందని గుర్తించారు. ఎంపికైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయనున్నట్లు సమాచారం. కార్యక్రమంలో వైద్యుడు బి.వివేక్‌వర్మ, సత్యసాయి సేవా సమితి కన్వీనర్ బి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో మిగులు సీట్లకు 15న ప్రవేశ పరీక్ష

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి మోడల్ స్కూల్‌లో 7,8,9వ తరగతుల్లో మిగులు సీట్ల భర్తీకి ఈనెల15న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ ప్రసన్నలక్ష్మి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆస్తకి ఉన్న విద్యార్థులు ఆ రోజు ఉదయం 10 గంటలకు పాఠశాలలో నిర్వహించనున్న పరీక్షకు హాజరు కావాలని సూచించారు. పరీక్షలో సాధించిన మార్కులు ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే 6వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సుల్లో ప్రవేశాలకు నేరుగా అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు. వివరాలకు 91779 51662, 79811 84687, 8463934607 నంబర్లకు ఫోన్‌లో సంప్రదించాలని సూచించారు.

పారిశుద్ధ్యపనులు

గజపతినగరం: మండలంలోని పురిటిపెంట మేజర్ పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికులు మంగళవారం పారిశుద్ధ్య పనులు చేపట్టారు. కాలువల్లో పేరుకు పోయిన పూడిక, చెత్తను తొలగించారు. చెత్తను కాలువల్లో పారబోయవద్దని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రజలకు కార్మికులు సూచించారు.